ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 31 జూలై 2024



ఐదేళ్ల జగన్ పాలన భూములున్న పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. వాగులు, వంకలు, శ్మశానాలు, కుంటలు, కాల్వలు ఇలా ఒక్కటేంటి కాదేదీ కబ్జాకనర్హం అన్నట్లుగా విలువైన ప్రభుత్వ భూములను మింగేశారు. ఇంకొందరు ముందడుగు వేసి కోట్ల విలువ చేసే ప్రైవేటు ఆస్తులను తక్కువ ధరకే లాక్కున్నారు. రికార్డులు మార్చుకున్నారు. దాదాపు రూ.5వేల కోట్ల విలువ చేసే భూములను వైసీపీ వారు కబ్జా చేశారని సమాచారం. మా భూములు అన్యాయంగా లాక్కున్నారు. మా భూములు కబ్జాకు గురయ్యాయి, కాపాడండి అంటూ అటు రెవెన్యూ ఇటు పోలీసు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా కూడా పట్టించుకునే నాథుడే లేడు. ఎందుకంటే ఆ రెండు శాఖలు అప్పట్లో వైసీపీ నేతల జేబు సంస్థగా ఉండేవి. ఇప్పుడు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం కాలిపోవడంతో విచారణలో.. మాజీమంత్రి పెద్దిరెడ్డి అనుచరుల భూదందాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. వాటిని చూసిన తరువాత కడప జిల్లా వైసీపీ భూబాధితుల్లో కూడా ధైర్యం వచ్చింది. జిల్లాలో కూడా వైసీపీ భూ బాధితులు కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది. త్వరలో ప్రభుత్వం ఒక కమిటీ వేసి రాష్ట్ర వ్యాప్తంగా గత ఐదేళ్లలో జరిగిన భూ ఆక్రమణలను వెలుగులోకి తీసుకురానుందని ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే జిల్లాలో వైసీపీ భూ కబ్జాలన్నీ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

- ప్రభుత్వ, పేదల భూములను చెరబట్టిన వైనం
- కొందరి నుంచి భయపెట్టి తక్కువ ధరకే కొనుగోలు
- అప్పట్లో వైసీపీ నేతలతో అంటకాగిన రెవెన్యూ, పోలీస్ అధికారులు
- విలువైన భూములు పోగొట్టుకున్న వారెందరో
- మదనపల్లె ఘటనతో పెద్దిరెడ్డి అనుచరుల ఆగడాలు ఒక్కొక్కటి వెలుగులోకి..
- కడపలో కూడా అదే పరిస్థితి
- కూటమి ప్రభుత్వంపై ఆశలు
- కమిటీ విచారణ జరిపితే..
- బద్దలు కానున్న కబ్జాల కహానీ

జగన్ పాలనలో.. భూ బాధితులెందరో..?

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ పాలన కబ్జాలమయమని చెబుతారు. ఈ కబ్జాలు ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న విలువైన భూములన్నీ కొట్టేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కడప నగరంలో స్థలాలు ఆక్రమించడంతో పాటు, నగరం చుట్టుపక్కలా వాగులు వంకలు, కాల్వలు అన్నీ ఆక్రమించేసి లేఅవుట్లు వేశారు.

కడపలో నియోజకవర్గంలో..

వినాయకనగర్ సర్కిల్‌లో ఓ కాలనీ పేరిట వెలసిన వెంచర్‌పై తీవ్ర ఆరోపణలున్నాయి. ఓ మాజీ ప్రజాప్రతినిధి కేసీకెనాల్‌కు చెందిన సుమారు రూ.5కోట్ల విలువ చేసే భూములు ఆక్రమించి కాలనీ పేరిట గృహ సముదాయాలు నిర్మించారంటారు. చిన్నచౌకు ప్రాంతంలో ఓ టైర్ షోరూం పక్కన వంకను ఆక్రమించేసి విక్రయాలు కూడా జరిపారని చెబుతారు. రింగురోడ్డులో కియా షోరూం పక్కన రూ.3కోట్ల విలువ చేసే 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించారు. సాయిపేటలోని టెలికాంనగర్‌లో దళితులకు చెందిన సుమారు రూ.2.5 కోట్ల విలువ చేసే స్థలాన్ని ఆక్రమించేసి లేఅవుట్ వేసి అమ్మినట్లు చెబుతారు. ఎర్రముక్కపల్లె సమీపంలో రైల్వే భూములనే ఆక్రమించేసి ప్లాట్లు వేశారు. ఆ భూములనే తాకట్టు పెట్టి రుణాలు తెప్పించారు. బుగ్గవంక వద్ద ప్రభుత్వ భూమి ఆక్రమించేసి పండ్లతోటలు కూడా నాటారు. ఇక బుగ్గవంక నుంచి వచ్చే పంటకాల్వలన్నీ కొందరు వైసీపీ నేతలు ఆక్రమించేసి వెంచర్లు వేశారు. రిమ్స్ సమీపంలో మాజీ కోఆప్షన్ మెంబరు వేణుగోపాల్‌కు చెందిన ఐదెకరాల భూమిని మైదుకూరు చెందిన వైసీపీ మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించేసి రిజిస్టరు కూడా చేయించుకున్నారు. వివాదం న్యాయస్థానంలో నడుస్తోంది. కడపకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులు మామిళ్లపల్లె రెవెన్యూపొలంలో రెండు ఎకరాలు ఆక్రమించారు. ఓ మాజీ చైర్మన్ కూడా రెండు ఎకరాలు ఆక్రమించారు. వైజంక్షన్ సమీపంలో తప్పుడుపత్రాలతో రూ.3కోట్ల విలువ చేసే స్థలాన్ని మాజీ చైర్మన్ కుటుంబ సభ్యులే ఆక్రమించేశారు. కడపకు చెందిన వైసీపీ నేత అనుచరుడు మార్తమ్మ అనే ఆమె పేరు మీద చిన్నచౌకు రెవెన్యూ పొలంలో తప్పుడు పత్రాలు సృష్టించి భారీ ఎత్తున కోట్లాది రూపాయల విలువ చేసే భూములు కాజేశారు.



యర్రబల్లె పంచాయతీలో తమ భూమిని ఆక్రమంచి బోరు వేశారంటూ చూపుతున్న సంపతి సుబ్బులు కుమారుడు పెద్ద గంగయ్య

కమలాపురం నియోజకవర్గంలో..

కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రికి చెందిన రామ్మోహన్‌రెడ్డి రిమ్స్ రాయచోటి బైపాస్‌లో నాలుగు ఎకరాలు కొనుగోలు చేశారు. అది కమలాపురానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఆధీనంలోకి వెళ్లింది. దీనిపై వివాదం నడుస్తోంది. వెట్టిచాకిరీ కింద ఇందిరా గాంధీ హయాంలో పొలతల క్షేత్రంలో పాలెంపల్లె, రూకవారిపల్లెకు చెందిన యానాదులకు 4.70 ఎకరాల భూములు ఇచ్చారు. అవి ఇప్పుడు వైసీపీ నేతల చేతల్లోకి వెళ్లాయి. పొలతల ప్రాంతంలో 150 ఎకరాల భూమి వైసీపీ చేతిలో ఉందని చెబుతారు. గంగనపల్లెలో బినామీ పేర్లతో 300 ఎకరాలు కొట్టేశారు. కమలాపురం నియోజకవర్గం పొడదుర్తిలో ఓ ఎమ్మెల్సీ సుమారు 50 ఎకరాలకు పైగా భూములను బినామీ పేర్లతో తీసుకున్నట్లు చెబుతారు. పొడదుర్తి ప్రాంతం సమీపంలో బయనకుంట నుంచి చెన్నకేశవ దేవాలయం వరకు ప్రభుత్వ భూములు స్థానిక వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

ప్రొద్దుటూరు రూటే సపరేట్

ప్రొద్దుటూరులో ఐదేళ్లు అరాచకం ఏలిందంటారు. అక్కడ హత్యలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు కూడా విచ్చలవిడిగా సాగాయి. కోట్లాది రూపాయల విలువ చేసే భూములు కారుచౌకగా అరాచక బ్యాచ్ కొట్టేసిందంటారు. లింగాపురంలో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే 20 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. రూ.3కోట్ల విలువ చేసే ఇరిగేషన్ భూమి ఆక్రమించేశారు. రూ.50కోట్ల విలువ చేసే చర్చి భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇక బీసీలు, ఆర్యవైశ్యులకు చెందిన విలువైన భూములను మార్కెట్లో కోటి విలువ ఉంటే రూ.20లక్షలు, రూ.30 లక్షలకే కొట్టేశారంటారు. అరాచకం బ్యాచ్ దాడికి నోరెత్తలేక తక్కువ ధరకే భూములను అప్పగించారు.

బద్వేలు రూటే వేరు..

బద్వేలు నియోజకవర్గంలో భూ ఆక్రమణలు ఇష్టారాజ్యంగా జరిగాయి. అటు కలసపాడు మొదలుకుని ఇటు అట్లూరు వరకు ప్రభుత్వ భూములు, నివాసస్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. బద్వేలులో సగం గోపవరం మండల పరిధిలోకి వస్తుంది. సర్వేనెం.953, 954, 955లో ఎస్టీవోలకు ఇంటిస్థలాలు కేటాయించారు. ఇక్కడ పబ్లిక్ పర్పస్ కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించేసి సొంత ఆస్తిలా వైసీపీ నేతలు ప్రహరీ నిర్మించుకున్నారు. చెన్నంపల్లె సర్వేనెం.1779, 1780లో వంద ప్లాట్లు అమ్ముకున్నా పట్టించుకున్న నాధుడు లేడు. నాగుల చెరువు, శివాలయం ఏరియా, సిద్దమ్మపేరంటాలు ఇలా కుంటలు, అటవీభూములు ఆక్రమించినా అడిగే దమ్ము ధైర్యం ఎవరికీ లేకుండాపోయింది. గోపవరం మండలంలోని మడకలవారిపల్లెలో ఎస్టీవోలకు ఇచ్చిన ప్రభుత్వ భూముల్లో నకిలీ పట్టాలతో రూ.కోట్ల విలువైన స్థలాలు అమ్మేశారు. ఇందులో వైసీపీ పెద్దల హస్తం ఉందని తేలడంతో విచారణను అక్కడితో ముగించేశారు. గోపవరం మండలంలోని బేతాయపల్లె సర్వేనెం.1563, 65లో భూములు ఆక్రమించారు. అట్లూరు మండలం కమలకూరు, నల్లాయపల్లె, ముత్తుకూరు రెవెన్యూ పొలంలో 41, 75, 79, 108, 112, 117లో 400 ఎకరాలు అన్యాక్రాంతమైంది. ఇటు పోరుమామిళ్ల,బి.కోడూరు, కాశినాయనలో ఇష్టారాజ్యంగా భూములు ఆక్రమించారు.

మైదుకూరు నియోజకవర్గంలో..

నంద్యాలంపేట సర్వేనెం.506బి, 507లో 304 ఎకరాల అటవీశాఖ భూమి ఉంది. ఆ భూమిని వైసీపీ నేతలు ఆక్రమించేశారు. ఇక్కడ ఎకరం సుమారు రూ.25లక్షలకు పైగా ఉంది. వంద ఎకరాలు ఓ మాజీ ప్రజాప్రతినిధి చేతుల్లో ఉన్నట్లు చెబుతారు. ఇక సీకేదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె, కమలాపురం మండలాల్లో ప్రభుత్వ భూములు, గుట్టలు కూడా వైసీపీ నేతలు వదిలి పెట్టలేదు. రూ.కోట్ల స్థలాలను కబ్జా చేసి తమ పేర్లతో రికార్డుల్లో ఎక్కించుకున్నారు.

వైసీపీ నేతల కబంధ హస్తాల్లో పేదల భూమి



1977లో ఇచ్చిన డిఫారం

సీకేదిన్నె మండలానికి చెందిన మూలింటి సుశీలయ్యకు ప్రభుత్వం 21 నవంబరు 1977లో సర్వేనెం.887లో 4.06 ఎకరాల భూమిని ఇచ్చింది. తండ్రి మరణానంతరం కొడుకు గంగయ్య పేరున భూమి మారింది. రెవెన్యూ రికార్డులన్నీ వీరిపేరుతో ఉన్నాయి. అయితే ఈ భూమిలో ప్రస్తుతం ఆర్డీవో ఆఫీసు ఇతరత్రా కార్యాలయాలున్నాయి. రాయచోటి జాతీయ రహదారి పక్కనే ఉంది. ఈ భూమి ఎకరం కోటిపైనే ఉందని చెబుతారు. సరాసరి వేసుకున్నా మొత్తం ఈ భూమి రూ.4కోట్లు పైమాటే. వైసీపీ హయాంలో ఓ నేత ఈ భూమి నాదంటూ ఆక్రమించేసి ఆధీనంలోకి తీసుకున్నారంటారు. న్యాయం చేయాలని బాధితుడు అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు.




సీకేదిన్నె మండల పరిధిలోని వైసీపీ నేతలు ఆక్రమించిన గంగయ్యకు చెందిన భూములు ఇవే

పెరాలసిస్ సోకడంతో మంచానికే పరిమితమై మాట్లాడుతున్న సంపతి సుబ్బులు



గిరిజనుడి డీకేటీ భూమి ఆక్రమణ

పులివెందుల రూరల్, జూలై 30: పులివెందుల మండలం యర్రబల్లె పంచాయతీలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎస్టీ కులానికి చెందిన సంపతి సుబ్బులు పొలాన్ని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఆక్రమించేశారు. రెవెన్యూ అధికారులకు డబ్బులు ఇచ్చి ఆయన పేరుతో ఆన్‌లైన్ చేసేసుకున్నాడు. రెండేళ్లుగా తమకు న్యాయం చేయాలంటూ అధికారులు చుట్టూ తిరుగుతున్న ఎవ్వరూ పట్టించుకోవడం లేదని సంపతి సుబ్బులు వాపోతున్నారు. బాధితుల కథనం మేరకు..
యర్రబల్లె పంచాయతీలో సర్వే నెంబర్ 1065-1లో 3.87ఎకరాల డీకేటీ భూమిని 1992లో ప్రభుత్వం సంపతి సుబ్బులుకు ఇచ్చింది. అదంతా రాళ్లు ఉండటంతో సాగులోకి తెచ్చే ఆర్థిక స్థోమత లేక అలానే వదిలేశారు. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లు కావడంతో దానిని సాగుచేద్దామని చూశారు. ఆ భూమిలో 2.57ఎకరాలను అదే గ్రామానికే చెందిన వైసీపీ నేత ఆక్రమించేశారు. ఈ విషయం తెలిసి సంపతి సుబ్బులు భర్త సంపతి నాగప్ప పెద్దమనుషుల వద్దకు వెళ్లారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఆక్రమించిన వారు ఆ భూమిలో బోరు వేశారు, రాళ్లతో చుట్టూ గోడకట్టారు. న్యాయం జరగకపోవడంతో మానసికంగా ఆవేదనకు గురై ఆరోగ్య క్షీణించి నాగప్ప ఇటీవల మృతిచెందాడు. ఆయన కుమారుడు పెద్దగంగయ్య అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు.. స్పందనలో అనేకమార్లు అర్జీలు ఇచ్చిన ఫలితం లేదు. డీకేటీ భూమి ఆక్రమణకు సంబంధించిన విషయంపై పులివెందుల ఆర్డీఓ వెంకటేశులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. డీకేటీ భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు.



స్పందనలో అందించిన అర్జీ



వెంచర్‌లో కలిపేసుకున్నారు

వల్లూరు, చెన్నూరు మండలాల సరిహద్దులోని దుగ్గనపల్లె రెవెన్యూ గ్రామ పొలం సర్వేనెంబర్ 103-ఏలో 6.7 ఎకరాల వంకపోరంబోకు భూమి 40 ఏళ్లుగా సిగమాల వెంకటసుబ్బమ్మ ఆధీనంలో ఉంది. ఇందులో వారు పంటలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వైసీపీ హయాం లో వీరి స్థలం పక్కనే వెంచర్ వేశారు. వారు 40 సెంట్లను ఆక్రమించి వెంచర్‌లో కలిపేసుకుని ప్రహరీగోడ నిర్మించుకున్నారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతున్నా రెవెన్యూ వారు స్పందించడం లేదని బాధితురాలు వాపోయారు.

రేపు ఇంటివద్దనే పింఛన్ల పంపిణీ

- కలెక్టర్ శివశంకర్ లోతేటి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కడప(కలెక్టరేట్), జూలై 30: లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 1వ తేదీ ఇంటివద్దే 100 శాతం పంపిణీ చేసేలా అన్నివిధాలా సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు జిల్లాలో 1వ తేదీన వంద శాతం పంపిణీ జరగాలని ఆదేశించారు. 31వ తేదీన మధ్యాహ్నంలోగా సంబంధిత బ్యాంకుల నుంచి పెన్షన్ మొత్తాన్ని ముందే డ్రా చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉండాలన్నారు. 1వతేదీన ఉదయం 5-30 గంటలకు సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి 6 గంటలకే పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. పెన్షన్లకు సంబంధించి బయోమెట్రిక్ డివైజ్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. పెన్షన్లు పొందే లబ్ధిదారులందరూ ఇళ్లవద్దే అందుబాటులో ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, జడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, కుడా వీసీ వై.ఓ.నందన్, డీఆర్డీఏ పీడీ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.


నేరాల నియంత్రణలో పోలీసులది కీలకపాత్ర



హోంమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్పీ

కడప(క్రైం), జూలై 30: నేరాల నియంత్రణలో పోలీసు అధికారులదే కీలకపాత్ర అని, మహిళల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ఈమేరకు అన్ని జిల్లాలో ఎస్పీలతో ఆమె మంగళవారం విశాఖపట్టణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిర్మూలనే లక్ష్యంగా రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుకు గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి కట్టడికి నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతో పాటు గిరిజన సంక్షేమశాఖ, ఆరోగ్యశాఖ, ఎక్సైజ్ శాఖలతో సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంటు బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ యు.వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు నీళ్లపాలు



- రూ.10.80 కోట్లతో 21 సీపీడబ్ల్యుఎస్ స్కీంలకు పోటాపోటీగా టెండర్లు
- పేరుకు అన్‌లైన్ టెండర్లైనా.. అంతా రాజకీయ నిర్ణయమే
- అనుకూల కాంట్రాక్టర్లకు.. అధికారుల వత్తాసు

కడప(రూరల్), జూలై 30: ఉమ్మడి కడప జిల్లాలోని బహుళార్థ తాగునీటి సరఫరా పథకాల (సీపీడబ్ల్యూఎస్ స్కీం) టెండర్లలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కడప, అన్నమయ్య జిల్లాల్లోని 21 స్కీంల నిర్వహణ కోసం రూ.10.80 కోట్ల వ్యయంతో జడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సంయుక్తంగా ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు. స్కీంల నిర్వహణను దక్కించుకోవడానికి వైసీపీ, టీడీపీ నేతలు పోటాపోటీగా టెండర్లు వేశారు.
వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఇతర పార్టీల వారిని స్కీంల దరిదాపుల్లోకి రానియ్యకుండా వారే సొంతం చేసుకుంటూ వచ్చారు. ఒకవేళ ఎవరైనా పోటీకి వస్తే టెండర్లను పక్కనపెట్టి అగ్రిమెంట్ల ద్వారా దక్కించుకొంటూ వచ్చారు. అయితే పలు జడ్పీ సర్వసభ్య సమావేశాలలో ఆయా జడ్పీటీసీ సభ్యులు సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని, లక్షల బిల్లులు బొక్కేస్తున్నా నీటిని మాత్రం సరిగా సరఫరా చేయడం లేదని మండిపడుతూ వచ్చారు. ఈ స్కీంలు ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయో లేదో గానీ కాంట్రాక్టర్లు మాత్రం బాగుపడుతున్నారని, వీటిపై విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని బి.మఠం జడ్పీటీసీ, ఎంపీపీలు పలుమార్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇటీవల వైసీపీ ఘోరంగా ఓటమిపాలై టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అయినప్పటికీ వైసీపీ నేతలు సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణను దక్కించుకోవడానికి తమకున్న పరిచయాల మేరకు పావులు కదుపుతున్నారు.

రెండు విడతలుగా టెండర్లు ఓపెన్

కడప, అన్నమయ్య జిల్లాల్లోని 21 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు రూ.10.80 కోట్ల వ్యయంతో టెండర్లను పిలిచారు. ఇందులో రూ.50 లక్షలలోపు ఉన్న 12 సీపీడబ్ల్యూఎస్ స్కీంల టెండర్లను సోమవారం సాయంత్రం 4 గంటల తరువాత ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఓపెన్ చేశారు. అన్నమయ్య జిల్లాలోని హత్యరాల, బోయినపల్లి, చెర్లోపల్లి, ఆకేపాడు, మాధవరం-1, మాదవరం-2, పొందలూరు, పెనగలూరుతో పాటు.. కడప జిల్లాలోని కె.ఎర్రగుడి, వేంపల్లె, పులివెందుల అఫ్‌ల్యాండ్, కమలాపురం సీపీడబ్ల్యూఎస్ స్కీంల టెండర్లు ఉన్నాయి. వీటిలో కమలాపురం, ఆకేపాడు సీపీడబ్ల్యూఎస్ స్కీంలకు సింగిల్ టెండర్లు రాగా మిగిలిన వాటికి 5 నుంచి 9 మంది వరకు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారు. కాగా.. రూ.50 లక్షలు పైబడిన టెండర్లను మంగళవారం సాయంత్రం 4 గంటల తరువాత ఓపెన్ చేశారు. ఇందులో మైదుకూరు, బి.మఠం, యోగివేమన యూనివర్శిటి, ముద్దనూరు, మైలవరం, కొండాపురం, పులివెందుల, గాలివీడు సీపీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్నాయి. సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణ టెండర్లు ఆన్‌లైన్ ద్వారా కొనసాగించినప్పటికీ ఇప్పటి వరకు రాజకీయ నేతల నిర్ణయం ప్రకారమే ఖరారు చేస్తూ వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజా టెండర్ల వ్యవహారంలో కూడా ఈ సంప్రదాయాన్నే కొనసాగించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పారదర్శకంగా టెండర్లు : జడ్పీ సీఈవో

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీపీడబ్ల్యుఎస్ స్కీంల టెండర్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని 21 సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణకు రూ.10.80 కోట్ల వ్యయంతో ఆన్‌లైన్ టెండర్లను పిలిచామన్నారు. టెండర్ల ఖరారులో ఎలాంటి రాజకీయ జోక్యం లేదన్నారు.

అనుకూల కాంట్రాక్టర్లకు అధికారుల వత్తాసు

జడ్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలోని కొందరు అధికారులు సీపీడబ్ల్యూఎస్ స్కీంల కాంట్రాక్టర్లతో కలిసిపోయి పరస్పర సహకారంగా పనిచేస్తున్నారు. దీంతో 2024-25 స్కీంల నిర్వహణ టెండర్లలో తమ అనుకూలురకు తిరిగి ఆయా స్కీంలను కట్టబెట్టే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఫలానా రాజకీయ నాయకుడిని సంప్రదించి ఫలానా అధికారికి ఫోన్ చేయిస్తే వారు తమకు అప్పగిస్తారని, తరువాత పని చక్కదిద్దుతామని సదరు కాంట్రాక్టర్లకు చెబుతున్నారని అంటున్నారు.

రూ.10.80 కోట్లతో 21 స్కీంలకు టెండర్లు

ఉమ్మడి కడప జిల్లాలో 22 సీపీడబ్ల్యూఎస్ స్కీంలు నడుస్తున్నాయి. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆయా ప్రాంతాల ప్రజలకు వీటి ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.10.80 కోట్లతో 21 స్కీంలకు ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు.

సీపీడబ్ల్యుఎస్ స్కీంల నిర్వహణకు ప్రాంతాల వారీగా..

● కడప డివిజన్‌లో	
కమలాపురం	రూ.42 లక్షలు
మైదుకూరు	రూ.105 లక్షలు
బి.మఠం	రూ.65 లక్షలు
వైవీయూ	రూ.63 లక్షలు
మాధవరం-1	రూ.41 లక్షలు
కె.మాధవరం-2	రూ.25 లక్షలు
● పులివెందుల డివిజన్‌లో	
ముద్దనూరు	రూ.80.50 లక్షలు
మైలవరం	రూ.92 లక్షలు
కొండాపురం	రూ.69 లక్షలు
పులివెందుల ఆఫ్‌ల్యాండ్	రూ.48 లక్షలు
కె.యర్రగుడి	రూ.38.50
వేంపల్లి	రూ.43 లక్షలు
పులివెందుల	రూ.145 లక్షలు
● రాజంపేట డివిజన్‌లో	
హెచ్.చెర్లోపల్లి	రూ.37 లక్షలు
ఆకేపాడు	రూ.4 లక్షలు
హత్యరాల	రూ.20 లక్షలు
పొందలూరు	రూ.42 లక్షలు
పెనగలూరు	రూ.19.30 లక్షలు
పుల్లంపేట	రూ.8 లక్షలు
● రాయచోటి డివిజన్‌లో..	
గాలివీడు	రూ.53 లక్షలు
కె.బోయనపల్లి	రూ.20 లక్షలు

- మొత్తం 21 సీపీడబ్ల్యూఎస్ స్కీంల నిర్వహణకు గాను రూ.1080.80 లక్షలతో టెండర్లను పిలిచారు.

పులివెందుల జగనన్న కాలనీలో భారీ అక్రమాలు

- **2,458 గృహాలు అనర్హులకు మంజూరు**
- **ప్రభుత్వ విచారణలో బయటపడ్డ అక్రమాలు**


పులివెందుల జగనన్న లేఅవుట్

పులివెందుల, జూలై 30: పులివెందుల జగనన్న కాలనీలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ప్రభుత్వం తేల్చి చెప్పింది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 8,648 పక్కాగృహాలకు 2,458 గృహాలు అనర్హులకు మంజూరు చేసినట్లు ప్రభుత్వం తేల్చి చెప్పింది.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజక వర్గమైన పులివెందులలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో అనర్హులకు పెద్దఎత్తున ప్రాధాన్యత కల్పించారు. చోటా మోటా నాయకులు చెప్పిం దే వేదం, చేసిందే శాసనంలా ఈ పక్కాగృహాల మంజూరు సాగింది. పక్క జిల్లాల వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారికి పక్కాగృహాలు మంజూరయ్యాయి. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. దీనితో ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విచారణలో అనేక విషయాలు వెలుగు చూశాయి. పులివెందుల జగనన్న కాలనీలో 2,458 మందిని అనర్హు లుగా గుర్తించారు. వీరంతా బినామీలుగా తేలింది. నంద్యాల, చిత్తూరు, అనంతపురం తదితర జిల్లాల వారికి కూడా ఇక్కడ పక్కాగృహాలు మంజూరయ్యాయి. అలాగే ఆధార్‌కార్డు నెంబరు కూడా లేకుండా పక్కాగృహాలు మంజూరయ్యాయంటే ఏస్థాయిలో బినామీలు ఉన్నారో ఇట్టే అర్థమవుతోంది. 366 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్న కుటుంబా లకు పక్కాగృహాలు మంజూరయ్యాయంటే పులివెందుల జగనన్న కాల నీలో ఏస్థాయిలో అక్రమాలు జరిగాయో చెప్పాల్సిన అవసరం లేదు.

విచారణలో తేలిన వాస్తవాలు

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణలో తేల్చిన వివరాలు చూస్తే.. పులివెందుల జగనన్న కాలనీలో మొత్తం 7075 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే వారి సంఖ్య 75. 1000చదరపు అడుగుల కంటే ఎక్కువ పట్టణ ఆస్తిని కలిగిన వారి సంఖ్య 248. ఇట్లో ఒక వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన లబ్ధిదారులు 366 మంది. నాలుగు చక్రాల వాహనం ఉన్న వారి సంఖ్య 83. మూడు కంటే ఎక్కువ (తడి) ఎకరాల భూమి ఉన్నవారు ఒకరు, 10ఎకరాలు పైబడిఉన్నవారు 16 మంది ఉన్నారు. అలాగే ఒకే ఇంట్లో నివాసం ఉన్న 13 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఎన్‌బీఎం పోర్టల్‌లో డేటా లేనివారి సంఖ్య 77, ఇతర మండలాలకు చెందిన వారు 307, ఇతర జిల్లాలకు చెందిన వారు 160 మంది ఉన్నారు. అలాగే.. ఆధార్‌లో పేర్లు సరిపోలని వారు 5 మంది, ఎక్కువ సైట్లు కేటాయించిన వారు ఒక్కరు ఉన్నారు, గతంలో ఇళ్లు పొంది మళ్లీ పొందిన వారు 19 మంది, పన్ను చెల్లింపుదారుల సంఖ్య 407. మొత్తం 1,675 మంది అనర్హులుగా గుర్తించారు. అంతేకాకుండా మున్సిపాలిటీలో సొంత ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారుల సంఖ్య 1318గా ఉంది. 1000 చదరపు అడుగులకంటే ఎక్కువ పట్టణ ఆస్తిగలవారు 95 మంది, అంతకటే తక్కువ ఆస్తి గలవారు 379 మంది ఉన్నారు. 300యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే వారు 75 మంది, ప్రభుత్వ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 74 మంది ఉన్నారు. అంతేకాకుండా ఇళ్ల స్థలాలు జారీ చేసిన ఇళ్లు మంజూరు కాని వారు 135 మంది ఉన్నారు. వీరిలో కూడా 65 మంది అనర్హులు ఉన్నారు. అలాగే రాజీవ్‌కాలనీ లబ్ధిదారులు ఇందులో 75 మంది ఉన్నారు. వీరిలో 17 మంది అనర్హులు ఉన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణలో గుర్తించారు. మొత్తం మీద పులివెందుల జగనన్న కాలనీలో దాదాపు 30 శాతం అవినీతి జరిగిందని తేల్చారు.

వనరులను ప్రభావవంతంగా వినియోగించుకోవాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: వైవీయూలో ఉన్న వనరులను ప్రభావవం తంగా వినియోగించేలా ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు ఎస్.రఘునాథ రెడ్డితో కలిసి మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. యూనివర్శిటీలో సురక్షిత నీరు, సోలార్ నుంచి లభించే విద్యుత్‌కు సంబంధించి అధికారులతో చర్చించారు. అలాగే నిర్మాణాలపై.. అందుకు తగ్గ వ్యయం, ఉన్న వనరులను గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అధ్యాపకులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. యూనివర్శిటీ అవసరాలపై ఇంజనీరింగ్ అధికారులు వీసీ దృష్టికి తెచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసరు జయరామిరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడి.. భావితరాలకు ఆదర్శంగా నిలవాలి


మొక్కలు నాటుతున్న రాజేంద్ర చౌదరి, సలీంబాషా

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: మొక్కల పెంపకమే భవిష్యత్‌తరాలకు అందించే గొప్ప బహుమతి అని.. పర్యావరణాన్ని కాపాడి భావితరాలకు మేలు చేయడమే కాక వారికి ఆదర్శంగా నిలవాలని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు సమాచార ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర కార్యాలయం, కడప ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల లో అమ్మపేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సలీంబాషా మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించడం మనందరి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి



చాపాడు, జూలై 30: మండలంలోని సీబీఐటీ కాలేజీ వద్ద ప్రొద్దుటూరు-మైదుకూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ (50) మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. గుర్తు తెలియని మహిళ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ప్రొద్దుటూరు నుంచి మైదుకూరు వైపు వెళుతున్న పల్సర్ మోటారు సైకిల్ ఢీకొనడంతో ఆమె తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్సకోసం ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. ఆమె ఆరెంజ రంగు పంజాబీ కుర్తా, బ్లూ రంగు రవిక ధరించి ఉంది. ఆమె ఆచూకీ తెలిసినవారు 9121100601కి తెలియజేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

14 మామిడి చెట్లు నరికివేత

గాలివీడు, జూలై 30: మండలంలోని అరవీడు గ్రామంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన షేక్.షబ్బీర్‌అహమ్మద్‌కు చెందిన 14 మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. షబ్బీర్ అహమ్మద్ జీవనోపాధి కోసం గల్ఫ్‌దేశానికి వెళ్లాడు. కాగా, తన పొలంలో 140 మామిడి చెట్లను పెంచుకుంటున్నారు. సోమవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు 14 చెట్లను నరికేశారని బాధితుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

టి.కోడూరులో సంఘటనలో 29 మంది అరెస్టు

కొండాపురం, జూలై 30: మండలంలోని టి.కోడూరు గ్రామంలో సోమవారం జరిగిన సంఘటనకు సంబంధించి 29 మందిని అరెస్టు చేసినట్లు సీఐ వేణుగోపాల్, తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీటీసీ రామమునిరెడ్డి నుంచి రివాల్వర్‌తో పాటు 29 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పవన్ కుమార్ రెడ్డి వర్గానికి చెందిన 19 మందిని, రామమునిరెడ్డి వర్గానికి చెందిన 10 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

సిద్దవటం, జూలై 30: మండలంలోని శాఖ రాజుపల్లె గ్రామ పంచాయతీ బ్రాహ్మణపల్లెకు చెందిన కౌలు రైతు వేటూరి పిచ్చయ్య (57) పాము కాటుకు గురై మృతి చెందాడు. గ్రామ సమీపంలో తాను సాగుచేస్తున్న అరటి పంటలో చెత్తను తొలగించేందుకు సోమవారం మధ్యాహ్నం వెళ్లాడు. పొలంలో చెత్తను తొలగిస్తుండగా పిచ్చయ్య చేతికి పాము కాటు వేయడంతో ఒంటిమిట్ట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి 108లో కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలియజేశారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు

కడప (నాగరాజుపేట), జూలై 30: జిల్లాలోని కడప, సిద్దవటం మండలాల్లోని పలు ప్రాంతాల్లో కడప విజిలెన్స్ విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 40 మందిపై కేసులు నమోదు చేసి.. రెండు లక్షల రూపాయల మేర అపరాధ రుసుం విధించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి దుర్మరణం

మృతుడిది చిట్వేలి మండలం వెంకటరాజుపల్లె


సంఘటన స్థలంలో మలిశెట్టి నరేంద్ర మృతదేహం

సూళ్లూరుపేట, జూలై 30: సూళ్లూరుపేట సమీపంలోని పిండిపాలెం క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి మలిశెట్టి నరేంద్ర (37) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు షార్‌లోని కంప్యూటర్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న నరేంద్ర మోటారు సైకిల్‌పై సూళ్లూరుపేట వైపు వస్తుండగా పిండిపాలెం క్రాస్ రోడ్డు వద్ద వున్న డాబాహోటల్ వద్ద ఆగివున్న లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతుడి వివరాల కోసం గాలించగా జేబులో ఉన్న ఆధార్ కార్డు, లైసెన్సు ఆధారంగా అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం వెంకటరాజుపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించి అక్కడ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. నరేంద్ర షార్‌లో పనిచేస్తూ సూళ్లూరుపేట సమీపంలోని షార్ ఉద్యోగుల కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి మోటారు సైకిల్‌పై డ్యూటీకి వెళ్లి మధ్నాహ్నం ఇంటికి వచ్చి తిరిగి డ్యూటీకి వెళ్లాడని, అయితే ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఎందుకు వెళ్లాడనేది తమకు తెలియడం లేదని ఆయన భార్య, బంధువులు పోలీస్ స్టేషన్ వద్ద కన్నీరుమున్నీరయ్యారు. మధ్నాహ్నం డ్యూటీకని వెళ్లిన నరేంద్ర రాత్రి 9 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిందన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని సోషల్ మీడియాలో తెలుసుకొని అనుమానంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు.

సీపీఎస్ ఉద్యోగుల పాక్షిక ఉపసంహరణపై నిషేధాన్ని ఎత్తివేయాలి


ఉప ఖజానా అధికారికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: సీపీఎస్ ఉద్యోగులు తమ కంట్రిబ్యూషన్ నుంచి అవసరాల కోసం పొందే ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు కోరారు. మంగళవారం జిల్లా ఉప ఖజానాశాఖ అధికారి వెంకటేశ్వర్లుకు ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు తమ జీతం నుంచి కంట్రి బ్యూషన్‌గా చెల్లించిన సొమ్ములో 25 శాతం వ్యక్తిగత, అనారోగ్య అవసరాల కోసం ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉందని.. ఆ సొమ్ము పొందడానికి ప్రస్తుతం ఖజానాశాఖ నిషేధం విధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలా మంది సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థిక అవసరాల కోసం లోన్ ద్వారా తీసుకోవాలనుకున్న సొమ్ము విడుదల చేయకుండా నిషేధించడం మంచిది కాదని.. వెంటనే వార్షిక ఉపసంహరణపై ఉన్న నిషేధం ఎత్తివేయాలన్నారు. జిల్లా ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు స్పందిస్తూ ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎజాజ్ అహ్మద్, చంద్రశేఖర్, గోపినాథ్, సురేశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీ అభివృద్ధిపథంలో నడవాలి : డీపీవో

కమలాపురం రూరల్, జూలై 30: ప్రతి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మీదేనని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కమలాపురం మండలానికి సంబంధించిన పంచాయతీ కార్య దర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మండల అభివృద్ధి కార్యా లయంలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకా లంలో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉం టుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు రోడ్లపై నిలబడుతుందని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేప ట్టాలన్నారు. వర్షాకాలంలో వర్షపు నిల్వడం వల్ల దోమలు ప్రబలి రోగాలు వస్తాయని.. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడరు చల్లించాలని, రోడ్లపై నిలబడిన వర్షపు నీరు తొలగించాలని సూచించారు. అనంతరం ఓడీఎఫ్ మొబైల్ యాప్, ఇంటి పన్ను వసూలు తదితర వాటి గురించి క్షుణ్ణంగా తెలిపారు. ఈ ప్రగతి నివేదికల్లో వెనుకబడిన గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులను, ఇంజనీరింగ్ అసి స్టెంట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రమణా రెడ్డి, ఈవో శారదమ్మ, డీఆర్‌పీ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి


ఉపాధ్యాయ, సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నిదియాదేవి

సుండుపల్లె, జూలై 30: విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలని రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మధ్యాహ్నం విద్యార్థినుల కోసం చేసిన భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. అలాగే తరగతి గదులు, టాయిలెట్లు, పరిసరాలను పరిశీలించి విద్యార్థినులకు మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నారని ప్రశంసించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తే మంచి స్థాయికి రాణిస్తారని.. అది గురువులతోనే సాధ్యపడుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ క్రమం తప్పకుండా తరగతులు జరుగుతున్నాయా, మంచి భోజనాన్ని అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చదువుకుంటేనే సమాజంలో గుర్తింపుతో పాటు ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. స్పెషల్ ఆఫీసర్ శివశృతి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుని కడప హుండీ ఆదాయం రూ.7,88,429


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్) జూలై 30: తిరుమల తొలిగడప దేవునికడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు మంగళవారం నిర్వహించారు. జూన్ 27వ తేదీ నుంచి ఈనెల 30 వరకు (34 రోజులకు) స్వామివారి దర్శనానికి ఆలయానికి వచ్చే భక్తుల ద్వారా కానుకల రూపంలో హుండీలో సమర్పించిన ఆదాయం రూ.7,88,429 సమకూరినట్లు వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవుని కడప దేవస్థానం సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి చంద్రానాయక్, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములపై చర్యలు

దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

పుల్లంపేట, జూలై 30: జిల్లాలో అన్యాక్రాంతమైన భూములను గుర్తించి చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరులోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన పుల్లంపేట శివాలయాన్ని సందర్శించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ పుల్లంపేటలోని సర్వే నెంబరు 33లో ఆంజనేయస్వామి ఆలయం మాన్యం 8ఎకరాలకు పైగా ఉందన్నారు. అనంతరాజు పేట సత్రం భూముల స్థితిగతులపై తహసీల్దారుతో చర్చించామన్నారు. భుజంగేశ్వరస్వామి ఆలయ భూముల్లో ఆక్రమణలను గుర్తించామని ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, తనిఖీ అధికారి శివయ్య, జూనియర్ అసిస్టెంట్ సుధీర్ కుమార్‌రెడ్డి, దేవస్థానం సభ్యులు పాల్గొన్నారు.

59 పరుగులతో కడప... 69 పరుగులతో విశాఖ జట్ల విజయకేతనం

- **డ్రాగా ముగిసిన చిత్తూరు- క్రిష్ణా జట్ల మ్యాచ్**


5 వికెట్లు సాధించిన నాగకుళాయప్ప (కడప), 158 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన ప్రణీత్ పవన్ (వెస్ట్‌గోదావరి)

కడప (స్పోర్ట్స్), జూలై 30: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లలో చివరి రోజైన కడప జట్టు 59 పరుగులతో విజయం సాధించగా, మరో మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు 69 పరుగులతో విజయకేతనం ఎగుర వేసింది. చిత్తూరు-క్రిష్ణా జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా....

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-శ్రీకాకుళం జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 63.3 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇందుకు ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తన 117.2 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో కడప జట్టుకు 251 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం ఆటకు చివరి మూడవ రోజున శ్రీకాకుళం జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో కడప జట్టు 59 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది. విజయంలో నాగ కుళాయప్ప (బౌలర్) 5 వికెట్లు తీసి కీలకంగా నిలిచారు.

కేఓఆర్ఎం మైదానంలో విశాఖ-వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 35.3 ఓవర్లలో 131 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో విశాఖ జట్టుకు 40 పరుగుల ఆధిక్యత లభించింది. విశాఖ తన రెండో ఇన్నింగ్స్‌లో 67.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 366 పరుగుల భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసి 406 పరుగుల ఆధిక్యత సాధించింది. ఆటకు చివరి రోజైన మంగళవారం వెస్ట్ గోదావరి జట్టు 86.2 ఓవర్లలో 337 పరుగులకే ఆలౌట్ కావడంతో 69 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇందులో ప్రణీత్‌పవన్(బ్యాటర్) 158 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో దేవాశిష్ 6 వికెట్లు పడగొట్టి జట్టు విజయానికి బాటలు వేశారు.

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో సాగిన క్రిష్ణా-చిత్తూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన క్రిష్ణా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 97.2 ఓవర్లలో 396 పరు గులకు ఆలౌట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 117.3 ఓవర్లలో 391 పరుగులకు ఆలౌట్ అయ్యి దీటుగా సమాధానం చెప్పింది. దీంతో క్రిష్ణా జట్టుకు 5 పరు గుల స్వల్ప ఆధిక్యత లభించింది. ఇదిలా వుండగా.. మ్యాచ్‌కు చివరి రోజైన మంగళవారం తిరిగి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన క్రిష్ణా జట్టు 53 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 202 పరుగులు చేసింది. దీంతో క్రిష్ణా జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధించినట్లయింది. ఎట్టకేలకు మ్యాచ్ డ్రాగా ముగిసింది.

మంత్రిని కలిసిన సుంకర శ్రీనివాస్



కడప (సెవెన్‌రోడ్స్), జూలై 30: దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డితో జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటరు, కడప నియోజక వర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ కలిశారు. మంగళవారం విజయ వాడ దేవదాయ ధర్మదాయ రాష్ట్ర కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా రాజకీయ పరిణా మాలపై చర్చించుకున్నారు.

కల్వర్టును ఏర్పాటుచేయాలి

వీరపునాయునిపల్లె, జూలై 30: తలపనూరు వంకకు కల్వర్టును ఏర్పాటు చేయాలని సర్పంచు శివకుమార్‌రెడ్డి, మండల టీడీపీ జనరల్ సెక్రటరీ గంగిరెడ్డి కోరారు. సర్వరాయ సాగర్ ద్వారా ఈ వంకకు నీరు వస్తుండడంతో రోడ్డుపై ప్రవహిస్తోందని, ప్రజలు ఇబ్బందులను ఎమ్మెల్యే పుత్తా చైతన్య దృష్టికి తీసుకెళ్లారు.



ప్రత్యేక అలంకారంలో సుబ్రహ్మణ్య స్వామి

నేత్రపర్వం - ఆడి కృత్తిక మహోత్సవం

కుజ,రాహు,కేతు దోష నివారణకు హోమము ● విశేష పూల అలంకరణ ● పోటెత్తిన భక్తులు





వేద పండితులు నిర్వహిస్తున్న హోమం - పూజలందుకుంటున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

కడప (కల్చరల్) జూలై 30: ఆడికృత్తిక పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కన్నుల పండువగా దర్శనమిచ్చాయి. పిల్లలు, పెద్దలు, ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవి ఆలయంలో...

నగర ఆకులవీధిలో వెలసిన రాజరాజేశ్వరీ దేవి ఆలయ ప్రాంగణలో వెలసిన సుబ్రమణ్యం స్వామి వారికి ఆలయ అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ, మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా పంచామృతాభిషేకం, కుజ.. రాహు..కేతు దోష నివారణకు హోమం, విశేష పూల అలంకరణ, గావించారు. భక్తులు స్వామివారి సేవలో తరించారు. ఆలయానికి కడప ఎంఎల్ఏ ఆర్. మాధవిరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఈ.ఓ. శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.

సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో...

నగర గడ్డిబజార్‌లో వెలసిన కామ కోటి కళాంబా సమేత సోమసుందరేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆడికృత్తిక మహోత్సవం నయనానందకరంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం, పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పంచామృతాభిషేకము, గణపతి హోమం, లక్ష్మీనారాయణ హోమం, రుద్ర, నవగ్రహ, నక్షత్ర, సుదర్శన హోమాలను నిర్వహించారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో...

కమలాపురం రూరల్, జూలై 30: రామాపురం క్షేత్రంలో వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామివార్ల ఆలయంలో అషాఢ కృత్తిక పురస్కరించుకుని సుబ్రమణ్యంస్వామి వార్లకు శాస్త్రోక్తంగా అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ ఆలయంలో స్వామివార్లకు నిత్య కల్యాణాలు నిర్వహిస్తుంటారు. శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామి వార్లను దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

వేంపల్లె, జూలై 30: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృతిక నక్షత్రం పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ గావించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందుకున్నారు.

క్రమశిక్షణతో లక్ష్యాలు సాధ్యం : ఎమ్మెల్యే మాధవి



విద్యార్థినులతో ఎమ్మెల్యే మాధవి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: క్రమశిక్షణతో చదివితే లక్ష్యాలు సాధించవచ్చని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్న ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ ఒక లక్ష్యం కలిగి ఉండాలన్నారు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రుల ఆశలకనుగుణంగా మంచి స్థాయిలో ఉండాలని సూచించారు. గురుకుల పాఠశాలకు వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్ల నిర్మాణానికి కృషి

నగరంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లను పునర్నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. మంగళవారం 3, 34వ డివిజన్ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి అమ్మవారు - రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్) జూలై 30: ఆదిపరాశక్తి... జగన్మాత విజయదుర్గాదేవి చల్లని తల్లి చెంత మంగళవారం నిర్వహించిన రాహుకాల పూజలకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4-30 వరకూ రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తల్లి సన్నిధిలో చేయడం వలన అమ్మవారు కరుణించగలదని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వేకువ జామునే అమ్మవారికి పంచామృత అభిషేకము అత్యంత భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఆగస్టు 5న పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్, వెల్లడించారు.

పారదర్శకంగా విధులు నిర్వహించండి

ఏఆర్ పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ



కడప (క్రైం), జూలై 30: ఏఆర్ పోలీసు సిబ్బంది సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఏఆర్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఆర్ పోలీసు అధికారులతో సమీక్షించిన ఆయన పారదర్శకంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గార్డు, ఎస్కార్ట్ విధులు, వ్యక్తిగత భద్రతా అధికారులు (పీఎస్‌ఓ) నిర్వహించే సిబ్బంది వివరాలు ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావును అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, టైటాస్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరం

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) జూలై 30: రాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. నగరంలోని ఫాతిమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. సీనియర్లు జూనియర్ విద్యార్థులను అవమానించడం, వేధించడం వంటివి ర్యాగింగ్‌లోకి వస్తాయన్నారు. ర్యాగింగ్ శిక్షలు కఠినతరంగా ఉంటాయన్నారు. వ్యక్తుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఎక్కువగా పిల్లలు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రిజిస్టర్ మెడికల్ వైద్యాధికారి దగ్గరకు వెళ్లి ప్రిస్క్రిప్షన్ ప్రకారం డ్రగ్స్ వాడాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడూ హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమావళిని పాటిస్తూ ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలన్నారు. పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

'నకిలీ ఏజంట్లపై దృష్టి సారించాలి'

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 30: పొట్టకూటి కోసం గల్ఫ్‌దేశాలకు పోతున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నకిలీ ఏజంట్లను నమ్మి ఉపాధి కోసం లక్షలు రూపాయలు పోగొట్టుకుని మగ్గిపోతున్న వారిని వారి సొంత ఇంటికి పిలిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు స్థానికంగా పనులు దొరక్క దుబాయి, మస్కట్, కువైట్, సౌదీ ఖతర్ లాంటి దేశాలకు వెళుతుంటారని, వారి ఆశలు ఆసరా చేసుకుని కొందరు ప్రైవేటు ఏజంట్లు అక్రమంగా అరబ్ దేశాలకు పంపుతున్నారని అలాంటి వారిపై దృష్టి సారించాలన్నారు. ఏజంట్ల మోసానికి బలైన బాధితుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇన్సాఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, నగరసహాయ కార్యదర్శి హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

గురిజాలలో విద్యార్థులకు శుభ దిన భోజనం

సింహాద్రిపురం, జూలై 30: గురిజాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుభ దిన భోజనం అందించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వప్పుగారి రామమోహన్‌రెడ్డి విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఎంఈఓ1 ఓబులేసు, ఎంఈఓ2 శారద ఆయన్ను అభినందించారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని దాతలు రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఎంఈఓ కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కళాకారులకు సమాజంలో మంచి గుర్తింపు'

కమలాపురం రూరల్, జూలై 30: కళాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉందని కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక షాదిఖానాలో త్యాగరాజస్వామి 10వ ఆరాధన మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ కళాకారులు అందరికీ బంధువులని, కళాకారులకు సమాజంలో మంచి గుర్తింపు ఉందని ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళలో నైపుణ్యం సంపాదించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, బోయిళ్ల శంకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, గంగాధర్‌రెడ్డి, రెడ్డికరీం, మాజీ కోఆప్షన్ మెంబరు అన్వర్‌బాషా, శ్రీనివాసులు, అబ్దుల్‌నబీ, నాగరాజు, అంజి, శేఖర్‌రెడ్డి, నాగేంద్ర, లక్ష్మయ్య, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం జరగాలి

ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్



పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ రాకేశ్‌చంద్రన్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: కడప కార్పొరేషన్ పరిధిలో ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం జరగాలని ఇన్‌చార్జ్ కమిషనర్ కె.రాకేశ్ చంద్రన్ సూచించారు. మంగళవారం కడప నగరం శంకరాపురం, ఎన్జీఓ కాలనీ, మృత్యుంజయకుంట, కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతాల్లో శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. శంకరాపురంలో పారిశుధ్య కార్మికుల హాజరు పట్టిని పరిశీలిస్తూ వారికి కేటాయించిన ప్రాంతాల్లో శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు మురికి కాల్వల్లో చెత్త ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

జీవామృతంతో భూసారం పెరుగుతుంది



తయారీని పరిశీలిస్తున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి, జూలై 30: పంటలకు జీవామృత వాడకంతో భూసారాన్ని పెంచుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఓబులేసు అన్నారు. మంగళవారం పెండ్లిమర్రి రైతుసేవా కేంద్రం పరిధి మహిళారైతు పద్మావతికి జీవామృతం డెమో చేయించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం పద్ధతులను పాటించాలని రైతులకు తెలిపారు. జీవామృతం వాడడం వలన భూమిలోని సూక్ష్మజీవుల శాతం పెరిగి జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, వీహెచ్ఏ వసంత, ఎన్ఎఫ్ఏ సందీప్, ఎంటి గంగిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో అధిక లాభాలు

కమలాపురం రూరల్, జూలై 30: వరిపంటలో కాలిబాటలు తీయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం పుట్లంపల్లె పొలాలను వరి ఇతర పంటలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ వరిలో ప్రతి 2 మీటర్లకు 20 సెంమీ కాలిబాటలు తీయడం వల్ల పంట అధిక లాభాలు గడిస్తుందన్నారు. కాలిబాటతో మొక్కలకు వెలుగు, గాలి బాగా తగులుతుందన్నారు. తద్వారా సుడిదోమను నివారించవచ్చన్నారు. అనంతరం పంటను ఆశించే వివిధ పురుగుల నివారణ చర్యలు గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, వ్యవసాయశాఖ సిబ్బంది ఇందిర, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వేముల, జూలై 30: పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడు రోగాలు దరిచేరవని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య అన్నారు. మంగళవారం వేల్పుల గ్రామంలో లార్వా సర్వే నిర్వహించి నీటి నిల్వలు ఉన్న చోట అబేట్ పిచికారీ చేశారు. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమకాటువలన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వీణకుమారి, ఆరోగ్యకార్యకర్త నాగేశ్వరి, ఆశాకార్యకర్త శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదైన వారిని సస్పెండ్ చేయాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 30: విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న మాజీ ఆర్జేడీ రాఘవరెడ్డికి మద్దతుగా హాజరై ఎఫ్ఐఆర్ నమోదైన ఎంఈఓ, ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప ఆర్జేడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆర్జేడీ అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన తరువాత ఎటువంటి అనుమతి లేకుండా హాజరైన ఎంఈఓ, ఉపాధ్యాయులపై కేసు నమోదైన విషయం గుర్తు చేశారు. వెంటనే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నేతలు జశ్వంత్, అబ్బాసాని, ఆరిఫ్, సురేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

'పేదల సొంతింటి కల నెరవేరబోతోంది'

చెన్నూరు, జూలై 30: టీడీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయం ఎంతో గర్వించదగ్గదని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న అన్నారు. చెన్నూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా సొంత గూడు లేక ఇబ్బంది పడే గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని, త్వరలో పేదల సొంతింటి కల నెరవేరబోతోందన్నారు. ముఖ్యంగా వైసీపీ పాలనలో పక్కా ఇళ్ల మంజూరు చేసినా అవి పూర్తి కాని పరిస్థితి, స్థలం కూడా అరకొరగా సెంటు, సెంటున్నరతో ఉపయోగంలేని పరిస్థితి చేశారన్నారు. కేవలం వైసీపీ నేతలు బాగుపడేందుకే ఈ పథకం జగనన్న గృహాలంటూ ఊర్లు ఊర్లు.. కాలనీ కాలనీ... అంటూ డబ్బా కొట్టుకుని నిరుపయోగంగా మార్చారన్నారు. కోట్లాది రూపాయలు ఇంటిస్థలాల భూముల కొనుగోలు కోసం వెచ్చించి వైసీపీ నేతలు బాగుపడ్డారే తప్ప పేదల సొంతింటి కల మాత్రం వైసీపీ పాలనలో నెరవేరలేదన్నారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో కట్టుకున్న ఇళ్లకు ఆ తరువాత వచ్చిన వైసీపీ పాలకులు పెండింగు బిల్లులు ఇవ్వక పోగా, వారి పాలనలో కూడా సక్రమంగా ఇళ్లు కట్టించలేక పోయారని ఎద్దేవా చేశారు. కనుపర్తి జగనన్న కాలనీ నాశిరకమని, నిర్మాణం పనులు అరకొరగా పూర్తయి చివరికి శ్లాబులు కారే పరిస్థితికి వచ్చిందని ఎద్దేవా చేశారు.

అవినీతికి అడ్డాగా మహిళా మార్ట్

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూలై 30: జగనన్న మహిళామార్ట్ అవినీతి అక్రమాలకు అడ్డాగా మారిందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మహిళా మార్ట్‌ను సందర్శించిన ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులకు ఉపయోగపడాల్సిన మహిళా మార్ట్ ఎందుకు ఉపయోగపడలేదన్నారు. తక్కువ ధరకు సరుకులు అమ్మాల్సి ఉండగా అన్నిచోట్ల ఉన్న ధరలే ఉన్నాయన్నారు. వచ్చిన లాభాల్లో డ్వాక్రా సభ్యులకు ఇవ్వాల్సి ఉండగా అలా జరగలేదని, కొందరు సభ్యులు దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. దాదాపు రూ.20లక్షల దాకా దుర్వినియోగం అయినట్లు తెలుస్తోందన్నారు. మూలధనమే రూ.10లక్షలు పెట్టినప్పటికి కనీసం లక్ష రూపాయల సరుకు కూడా ఇక్కడ లేదన్నారు. దీనిపై అడిగితే ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నారన్నారు. ఆడిట్ కూడా జరగలేదన్నారు. అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు. 2014-2019లో టిడ్కో ఇళ్ల కోసం పేదలు డిపాజిట్లు చెల్లించారన్నారు. ఆ డబ్బును ఇంత వరకు లబ్ధిదారులకు వెనక్కి ఇవ్వలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారుల నుంచి రూ.35వేలు వసూలు చేశారని, ఈ డబ్బు కూడా ఏమైందన్న విషయాన్ని చర్చించామన్నారు. దాదాపు రూ.9 కోట్లు ఉందన్నారు. ఇప్పటికే 2500పైగా ఇళ్లు అనర్హులకు ఇచ్చారన్నారు. దీనిపై కలెక్టర్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పెద్దదుద్యాల గ్రామస్థులతో ఫ్యాక్టరీ యాజమాన్యం చర్చలు

● రెండునెలల్లో ఫ్యాక్టరీ మూతవేయాలని ఒప్పందం ● అగ్రిమెంట్ రాసి ఇచ్చేంత వరకు నిరసన కొనసాగుతుంది :పెద్దదుద్యాల గ్రామస్థులు

ముద్దనూరు జూలై30: మండల పరిధి పెద్దదుద్యాల గ్రామ సమీపంలోని జీఎం ఎకో కెమికల్ ఫ్యాక్టరీ వద్ద ఆ గ్రామ ప్రజలు ఏడురోజులుగా చేపడుతున్న నిరసన విధితమే. కాగా మంగళవారం పోలీసుల సమక్షంలో ఫ్యాక్టరీ యాజమాన్యానికి నిరసన స్తున్న కొందరితో ఫ్యాక్టరీలో చర్చలు జరిపారు. అయితే విలేకరులను అనుమతించలేదు. ఈ సందర్భంగా స్థానికుడు సాంబశివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెందిన కనకప్రసాద్, భార్గవరెడ్డి చర్చలు జరిపారు.6నెలల వ్యవధిలో ఫ్యాక్టరీలోని ముడి సరకు ఖాళీ చేసి, మూత వేస్తామన్నారు.అయితే దానికి తాము రెండు నెలల్లో ఖాళీ చేసి ,శాశ్వతంగా ఫ్యాక్టరీ మూతవేయాలని డిమాండ్ చేశామన్నారు.అలాగే అగ్రిమెంట్ రాసివ్వాలని తెలిపామన్నారు. దానికి వారు సానుకూలంగా స్పందించారు.అయితే వారు అగ్రిమెంట్ రాసిఇచ్చేంత వరకు నిరసన కొనసాగుతుందన్నారు.తమకు మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు తదితరుల సమక్షంలో అగ్రిమెంట్ తీసుకుంటామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్,కడప నగర టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షురాలు విజయలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జమ్మలమడుగు, జూలై 30: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది భూతమాపురం సుబ్బారావు తెలిపారు. మంగళవారం వివేకానంద జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో న్యాయవాదులు విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీగోకులాలకు దరఖాస్తు చేసుకోండి

ముద్దనూరు జూలై30: అర్హులైన వారు సబ్సిడీ మినీ గోకులాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఏరియా పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాలకుడు వాసశ్రీనివాస తెలిపారు.రైతులకు రెండు నుంచి ఆరు పశువుల షెడ్లకు 90శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్ళ షెడ్లకు 70 శాతం రాయితీలో ప్రభుత్వ అందిస్తుందన్నారు.అర్హులైన రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్ ,బ్యాంకు,భూమి పట్టాదారు పాస్‌బుక్ తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి అందజేయాలన్నారు.

కుక్కల పట్టివేత



జమ్మలమడుగు, జూలై 30: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో కొన్ని నెలలుగా ప్రధాన రోడ్లపై కుక్కలు రాత్రి, పగలు స్వైరవిహారం చేస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు పాఠశాలలో సైకిళ్లలో వెళ్లాలన్నా కుక్కలదాటికి భయపడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులకు రోడ్లపై గుంపులుగా కుక్కలు వెంటపడుతున్నాయి. పలుచోట్ల ద్విచక్ర వాహనదారులు వెంటపడిన కుక్కల భయానికి కిందపడి గాయాలపాలయ్యారు. అందులో భాగంగా జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో కుక్కలను పడుతున్నారు.

ఇంటి వద్దకే పింఛన్లు

గోపవరం, జూలై 30: మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అర్హులకు జూలై మాసానికి సంబంధించిన పింఛన్లను వారి వారి ఇళ్ల వద్దనే అందిస్తామని ఎంపీడీవో రాధాక్రిష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పింఛను తీసుకునేవారి ఆగస్టు 1న వారిఇంటి వద్దనే అందుబాటులో ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని పింఛను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

ఇసుక రీచ్ లను పరిశీలించిన ఆర్డీవో



కొండాపురం, జూలై 30: మండలంలోని పి.అనంత పురం, కె.వెంక టాపురం వద్ద ఉన్న ఇసుక రీచ్‌లను జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. గండికోట బ్యాక్‌వాటర్ వచ్చే లోపు ఇసుకను డంపింగ్ చేసేందుకు అధికారులతో చర్చించారు.నదిలో నుంచి స్టాక్‌పాయింట్‌కు ఇసుకను తరలిం చేందుకు తగిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో నాగప్రసాద్,డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరమ్మ, ఆర్ఐ ఆనందరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ టెట్‌లో ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30: ఏపీటెట్ 2024 పరీక్షకు సిద్ధమయ్యే ఉర్దూమీడియం విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎస్.ఇమామ్ హుస్సేన్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో జిన్నారోడ్డులోని మోడంపల్లె మున్సిపల్ ఉర్దూ హైస్కూలులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9440703867, 9030874612 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భూకబ్జాలపై అలసత్వం తగదు

బద్వేలు రూరల్, జూలై 30 :బద్వేలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు చెక్‌డ్యాంలు, కాలవలు సైతం కబ్జా జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అలసత్వం వహించడం దారుణమని సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. మంగళవారం కబ్జాకు గురైన భూములను సీపీఐ రూరల్ సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ పట్టణ కార్యదర్శి మునిరత్నం, సీపీఐ నాయకులు హరిక్రిష్ణ, వినోద్, సుధాకర్, ప్రసన్న, వెంకటపతి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఖాజీపేట, జూలై 30: వాహనాలు నడిపేవారు మద్యం తాగి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రామాంజులు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆకతాయిలపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నామని హెచ్చరించారు.

పోస్టుమార్టంపై ఆసుపత్రిలో బంధువుల ఆగ్రహం



ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు

ప్రొద్దుటూరు, జూలై 30 : తెలుగుగంగ రిజర్వాయర్‌లో ఆదివారం గల్లంతై మృతిచెందిన ఎస్కే ముదాఫిర్, పఠాన్ రహమతుల్లా, తాహిద్ మోహిద్దీన్ అనే ముగ్గురు యువకులకు వైద్యులు జరిపిన పోస్టుమార్టంపై మృతువుల బంధువులు జిల్లా ఆసుపత్రిలో మంగళవారం ఆందోళనకు దిగారు. ఏకంగా వైద్యులు,సిబ్బందిపై దాడికి ప్రయత్నించారు. వివరాల్లోకి వెళితే ఆదివారం తెలుగు గంగ రిజర్వాయర్‌లో గల్లంతై మృతి చెందిన యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిస్థాయిలో చేయవద్దని వారి మరణం కేవలం ప్రమాదం అని బంధువులు ఆసుపత్రి వైద్యులకు విన్నవించుకున్నారు. వారికి సాంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు చేయాలని కోరారు. కాగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ,మాజీమున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ వైద్యులకు పోస్టుమార్టం పార్మాలిటీగా చేయాలని సూచించారు. కానీ వైద్యులకు ఈ విషయం ఆసుపత్రి సూపరింటెండెంట్ సరిగా సమాచారం ఇవ్వకపోవడంతో వారు పూర్తి స్థాయిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. దీంతో మృతుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పోస్టు మార్టం చేసిన వైద్యులపై దాడి చేసేందుకు మూకుమ్మడిగా వెళ్ళారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా వున్న డాక్టర్ గోపాల్‌తో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వెంటనే మృతుల బంధువులు, స్నేహితులను కట్టడి చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్, టూటౌన్ సీఐ కరీం వారితో చర్చించి అదుపు చేశారు. మరోవైపు ఈ దౌర్జన్యంపై ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది విధులు బహిష్కరించి కొద్దిసేపు నిరసన తెలిపారు. ఆ తరువాత ముస్లిం మహిళలు ఆసుపత్రి బయట రోడ్డుపై భైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాగా మృతదేహాలను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పరిశీలించారు.

బీసీ భవన నిర్మాణ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న బీసీ నాయకులు

బద్వేలు, జూలై 30: పట్టణంలో పూలే బీసీ భవన నిర్మాణ సాధనకు నూతన కమిటీని ఎన్నుకునేందుకు పూలే, సావిత్రి బాయి పూలే సాధన కమిటీ చైర్మన్ గురుమూర్తి ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు.ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బాల చెన్నయ్య మాట్లాడుతూ పట్టణంలో బీసీ భవనం లేని కారణంగా సమావేశాలు,చిన్నచిన్న శుభ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. అనంతరం జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడుగా వెంకటరమణ యాదవ్, అసోసియేట్ అధ్యక్షుడుగా బాల చెన్నయ్య యాదవ్, వర్కింగ్ అధ్యక్షుడుగా మిత్తికాయల రమణ యాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కత్తి బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కావేటి రమేష్‌యాదవ్, కోశాధికారిగా మారెళ్ల శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా బద్వేలు గురుమూర్తి, బీసీ రమణ, వజ్రాల వెంకటస్వామి, సాగర్ అంతేగాక ఆరుగురిని ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

నామ మాత్రంగా సర్వసభ్యసమావేశం

ముద్దనూరు జూలై30:స్థానిక ఎంపీడీవో సభాభవనంలో మంగళవారం ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం జరిగింది.సమావేశానికి ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి గైర్హాజరయ్యారు.అందులో భాగంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల్లో జరిగే ప్రగతి నివేదికను సభలో తెలియజేశారు.అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్యసమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని, శాఖలపై అవగాహనలేని సిబ్బందిని పంపకూడదన్నారు. తాగునీరు,ఆరోగ్యం, విద్యుత్,వ్యవసాయంపై ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు.ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశాలకు తప్పక హాజరు కావాలన్నారు. మూడు సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరైతే అనర్హత వేటు పడే అవకాశముందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు-పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : డీపీవో



మాట్లాడుతున్న డీపీవో ప్రభాకర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, జూలై 30: గ్రామాల్లో తాగునీరు-పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి డి.ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎర్రగుంట్లలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లలో ప్రతి విషయాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. పారిశుధ్యం,మంచినీటి సరఫరా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వీటికి సంబంధించి కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఏ.జాషువా,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయశేఖర్, డీఎల్‌పీవో రమణారెడ్డి, ఏఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య, రిసోర్స్ పర్సన్ దేవేంద్ర పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 30: స్థానిక కొర్రపాడు రోడ్డులోని వివేకానంద క్లాత్‌మార్కెట్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైందని వివేకానంద క్లాత్‌మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి శంకర్ తెలిపారు. మంగళవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకట చెంచయ్య, డాక్టర్ అనూష, వల్లంకొండు, డాక్టర్ సీరిన్ రోగులను పరీక్షించారు. 180 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంపు కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు రాకముందే పూడిక తీత పనులు పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు,జూలై 30 : వర్షాలురాక ముందే కాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ రఘునాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని దొరసానిపల్లె చానల్ సుందరాచార్యుల వీధు ల్లోని పలుచోట్ల కాలువల్లో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్‌పర్య వేక్షించారు. పూడిక తీత పనులు సక్రమం గా చేసేలా ఇంజనీరింగ్ అధికారు పర్యవేక్షిం చాలన్నారు. పూడిక తీత ఫొటోలు పెట్టాలని తెలిపారు. ఇందుకు ఈ ఈ, డీఈ, ఏఈ లు పనులు పూర్తి స్థాయి లో పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ కు తెలిపారు.

కోట పోలేరమ్మకు వడిబియ్యం సమర్పణ



కోలాటం వేస్తున్న మహిళలు

పోరుమామిళ్ల, జూలై 30 : ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం బ్రాహ్మణవీధి, తంబాబావివీధి, మూలవీధి, శీనప్పబావివీధి, అన్నివీధుల వారు గ్రామ దేవత అయిన పోలేరమ్మ, చౌడమ్మతల్లికి వడిబియ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి కోలాటం ప్రదర్శిస్తూ పోలేరమ్మగుడి వరకు శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించి వడిబియ్యం సమర్పించారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.22.21లక్షలు

బ్రహ్మంగారిమఠం, జూలై 30 : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ప్రస్తుత దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ పర్యవేక్షణలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యుల సమక్షంలో లెక్కించారు. ఏడు హుండీలు, 30 రోజులుకుగాను లెక్కించగా రూ.22.21 లక్షలు ఆదాయం వచ్చినట్లు శంకరబాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి తిరుమల దేవస్థానం ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర, మఠం మేనేజరు ఈశ్వరయ్యాఆచారి, పూర్వపు మఠాధిపతుల కుటుంబసభ్యులు, బ్యాంకుసిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జంప్ రోబ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పోరుమామిళ్ల, జూలై 30 : జాతీయస్థాయి జంప్ రోబ్ పోటీలకు శ్రీవైష్ణవి స్కూలు విద్యా ర్థులు ఎంపిక య్యారని కరస్పాండెంట్ రామక్రిష్ణ తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో నంద్యాల జిల్లాలో రాష్ట్రస్థాయి జంప్ రోబ్ పోటీల్లో పాఠశాలల నుంచి ఆరు గురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. వీరు ఆగస్టు నెలలో మహారాష్ట్రలోని నాశిక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

తెల్లపశువులకు లంపీస్కిన్ జబ్బురాకుండా టీకాలు

కలసపాడు, జూలై 30 : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం తెల్లపశువులకు (ఆవులు, ఎద్దులు) లంపీస్కిన్ జబ్బు రాకుండా ముందు జాగ్రత్తగా ఉచితంగా టీకాలు వేయించడం జరిగింది. మండలంలో మొత్తం 250 తెల్లపశువులకు మంగళ, బుధవారాల్లో మొత్తం అన్ని పశువులకు వ్యాక్సిన్ వేస్తామని పశువైద్యాధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. లంపీస్కిన్ వ్యాధి వల్ల పశువు చర్మంపై దద్దుర్లు ఏర్పడి కాళ్లు, మెడభాగాల్లో గంగడోలు తదితర ప్రాంతాల్లో నీరు చేరి పశువు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు తప్పకుండా ఇంటి దగ్గర ఉంచి అన్ని తెల్ల పశువులకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

కుష్టువ్యాధి సర్వేపట్ల అశ్రద్ధ వద్దు



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

ఖాజీపేట, జూలై 30 : ఆరోగ్య సిబ్బంది కుష్టువ్యాధి సర్వే సక్రమంగా నిర్వర్తించాలని, అశ్రద్ధ చూపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా అడిషనల్ వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సగిలి రవిబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లూరు, అప్పనపల్లె పంచాయతీల్లో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించి అలాగే ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, హెల్త్ సూపర్‌వైజర్ క్రిష్ణప్రియ, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిపనులపై ఆకస్మిక తనిఖీ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 30 : ఉపాధి పనులపై జిల్లా స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించాలని అప్పుడే ఉపాధిపనుల్లో జరిగే అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక హౌసింగ్ బోర్డు కార్యాలయంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక వార్షిక నివేదిక ప్రణాళిక అమలుపై మండల అధ్యక్షుడు శేకర్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనులపై గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించడం లేదని ఆయన ఆరోపించారు. చాలా మంది పట్టణాల్లో తిరుగుతున్నారని క్షేత్ర స్థాయిలో ఉపాధి పనులు పర్యవేక్షించడం లేదన్నారు.అధికారులు,సిబ్బందిలో ఇకనైనా మార్పు కనపడాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హెచ్చరించారు. సమావేశంలో డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, ఏపీడీ జుబేదా బేగం, ఎంపీడీవో కుళాయమ్మ, విజయ భాస్కర్, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఉపాధి హామీ, ఫీల్డ్ అసిస్టెంట్లు,మేట్లు,కొత్తపల్లె గ్రామ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాలికలు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి వైజే పద్మశ్రీ

బద్వేలు రూరల్, జూలై 30 : బాలికలు సత్ప్రవర్తనతో మెలుగుతూ మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ కోరారు. మంగళవారం పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న బాలికల వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆడపిల్లలు ఏ విధంగా మోసపోయి తప్పుదారి పడుతున్నారన్న విషయాలపై అవగాహన కలిగించారు. కొత్త వ్యక్తులు ఏదైనా ఇస్తే తీసుకోవడం, తినడం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టలు వార్డెన్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే దోమలను తరిమికొట్టాలి

ప్రొద్దుటూరు , జూలై 30 : ఇంటినుండే దోమలను తరిమి కొట్టాలని మున్సిపల్ కమీషనర్ రఘునాథరెడ్డి విద్యార్థినులకు పిలుపు నిచ్చారు. మంగ్లవారం స్థానిక ఎద్దుల వెంకట సుబ్బమ్మ మున్సిపల్ హైస్కూలులో దోమలు నియంత్ర ప్రబలనున్న వ్యాధుల పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంట్లో పరిసరాల్లో పరిశుభ్రంగా వుండేలా చూడాలన్నారు. పరిసరాలు అపరి శుభ్రంగా వుంటే మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేయాలన్నారు. దోమలు ఇంటిలో కుట్టకుండా దోమతెరలు వాడటం దోమల మందులు వాడటం చేయాలన్నారు. జ్వరాలు వస్తే నిర్లక్ష్య ంచేయకుండా వైద్యుని సంప్రదించాలన్నారు. స్వంతంగా మాత్రలు వాడటం వలనప్రయోజనం వుండదన్నారు.కార్యక్రమంలో మెడికల్‌హెల్త్ ఎడ్యూకేటర్ వెంకటేశ్వర్లు శంకరయ్యలు పాల్గొన్నారు.

రెండురోజుల్లో చాపాడుకెనాల్, కేసీకి సాగునీరు విడుదల

రాజుపాలెం, జూలై 30: శ్రీశైలం రిజర్వాయరు వరద నీటితో నిండుకుండలా మారడంతో కేసీకి శుక్రవారం చాపాడు కెనాల్, కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ జాన్సన్ తెలిపారు. ఇప్పటికే చాపాడు కెనాల్‌లో కంపచెట్లు అడ్డంగా ఉన్న పూడిక తీత పనులు ప్రారంభించారు. రాజుపాలెం, ప్రొద్దుటూరు, చాపాడు మండలాల్లో దాదాపు 18,452 ఎకరాలకు సాగునీరందించేందుకు ఈ కాల్వ ఏర్పాటు చేశారు. అలాగే కేసీ ప్రధాన కాల్వ కింద నంద్యాల జిల్లా, చాగలమర్రి మండలం, కడప జిల్లాలోని రాజుపాలెం, దువ్వూరు, చాపాడు, మైదుకూరు ఖాజీపేట మండలాలున్నాయి. కాగా రాజోలి ఆనకట్ట వద్ద నుంచి కుందూలోకి 6040 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

డీసీసీ బ్యాంకును తనిఖీ చేసిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు , జూలై 30 : వైఎంఆర్‌కాలనీలో వున్న డీసీసీ బ్యాంకును ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్యాంకు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. బ్యాంకు ఇచ్చిన రుణాలు వసూళ్ళపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో బ్యాంకు అధికారులతో సహకార సంఘాలకు రుణ పరపతి, ఇతర సమస్యలపై చర్చిస్తానని నివేదికలు సిద్ధం చేసుకోమని తెలిపారు.

కేరళకు తరలిస్తున్న ఆవులను అడ్డుకున్న బీజేపీ నాయకులు



బి.కోడూరు, జూలై 30: మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు బస్ షల్టరు దగ్గర నుంచి ఆవులను గూడ్సు లారీలో ఎక్కించి కేరళ కటిక అంగడికి తరలిస్తున్నట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డికి సమాచారం అందింది. దీంతో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, నియోజకవర్గ కో-కన్వీనరు పండరి, నాగేంద్ర మంగళ వారం రాత్రి 9గంటల సమయంలో గూడ్సు లారీని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బద్వేలు సీఐ యుగంధర్, బి.కోడూరు ఎస్ఐ జయరాములు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలిస్తున్నారు. కాగా బి.కోడూరు మండలానికి చెందిన ఒక వ్యాపారి చుట్టుపక్కల గ్రామాల్లో ఆవులను కొనుగోలు చేసి రాత్రివేళల్లో ఎల్ఎస్‌పీ డ్యాం దగ్గరకు గుంపు చేసి రాత్రికి రాత్రే గూడ్సు లారీలో కేరళ రాష్ట్రానికి కటిక అంగడికి తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. పట్టుకున్న ఆవులను చల్లబసాయిపల్లె గోశాలకు తరలిస్తున్నట్లు వారు తెలిపారు.